క్లుప్తంగా

జాతరకు ముస్తాబు



ఇంజేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో గంగమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేడుక నిర్వహిస్తారు. జాతరలో భాగంగా తొలిరోజు శుక్రవారం గ్రామ దేవతలకు పూజలు, రథం ముగ్గు వేయుట, ఒంటి కొమ్ము బొల్లి ఆవు గ్రామ ప్రవేశం, పెద్దిరాజు కథ, శనివారం సిద్ధి భుక్తి యాగం, పుట్టబంగారు తెచ్చుట, శమి వృక్ష యాగం, బొల్లావుల పొట్లాట, గంగకాటమరాజు కథ చెప్పడం, చివరి రోజు ఆదివారం మద్దిమాను యాగం, బోనాలు తీయడం, ఆవుల పందేరం, దీవెన బండారు ఇవ్వడం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

హౌసింగ్ ఏఈగా యోగేశ్వరయ్య

శిరివెళ్ల: మండల హౌసింగ్ ఏఈగా యోగేశ్వరయ్య నియమితులయ్యారు. గత ఏఈ అహమ్మద్ బాషా పదవీ విరమణ చేయడంతో ఈ నియామకం జరిగింది. కాగా నూతన ఏఈ బోయలకుంట్ల గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఆయనకు ఏఈగా ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు.

మున్సిపల్ కమిషనర్‌గా శేషన్న



కమిషనర్‌ను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బి.శేషన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు బాధ్యతలు నిర్వర్తించిన నిరంజన్‌రెడ్డి ఇటీవల విజయవాడకు బదిలీ అయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శేషన్నను నంద్యాలకు నియమించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను సిబ్బంది, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అభినందించారు.

పోస్ట్‌మెన్‌లకు సన్మానం



పోస్ట్‌మెన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): మారుమూల ప్రాంతాలకు నిరంతరం తపాలా సేవలు అందిస్తూ సమాచార వారధులుగా నిలుస్తున్న పోస్ట్‌మెన్‌లను గురువారం జాగృతి వారపత్రిక నంద్యాల శాఖ సభ్యులు స్థానిక పోస్టాఫీస్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది, సేవా భారతి ఉమ్మడి కర్నూలు జిల్లాల సంఘటనా కార్యదర్శి నీలకంఠం ముఖ్య అతిథిగా హాజరై వారి సేవలను కొనియాడారు. చింతలపల్లి వాసు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆదినారాయణ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నందమూరినగర్‌లో ఉన్న స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ బుడగజంగాల హాస్టల్‌లో గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, సొసైటీ నిర్వాహకులు సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బయట ఉన్న బిక్షాటన, బాల కార్మికులు, వీధి బాలలు, పాఠశాలల్లో చేరాలన్నారు. రాజు, నాగలక్ష్మి, లక్ష్మిదేవి, సౌజన్య పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించరాదని, తొలగించిన 2,500 మంది కాంట్రాక్ట్ వర్కర్లను విధుల్లోకి తీసుకోవాలని విశాఖ ఉక్కుకు సొంత గనులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కేంద్ర కమిటీ పిలుపు మేరకు సాయిబాబానగర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు రాష్ట్ర ప్రజలకు గుండెకాయ లాంటిదన్నారు. నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, సుశీలమ్మ పాల్గొన్నారు.

సమస్యల తిష్ట!

- పునఃప్రారంభమైన బడులు
- వేధిస్తున్న సౌకర్యాల లేమి



బీవీనగర్‌పాఠశాల ఆవరణలో నిలిచి ఉన్న మురుగునీరు

గోస్పాడు: నెలన్నర రోజుల విరామం బడిగంట మోగింది. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఒక వైపు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఉండటంతో పాటు మరికొందరు ఉపాధ్యాయులు రిక్వెస్ట్‌పై కౌన్సెలింగ్‌కు వెళ్లారనే సమాచారం. మండలంలోని పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఎం.చింతకుంట్లలో ఐదుగురు ఉపాధ్యాయులకు గాను ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. జూలేపల్లెలో హెచ్‌ఎం ఒక్కరే విధులకు హాజరయ్యారు. స్థానిక డిపెప్ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులకు ఇద్దరు మాత్రమే వచ్చారు. బీవీ నగర్‌లో ఒకే ఉపాధ్యాయురాలు ఉండగా 11గంటల వరకు రాలేదు. అక్కడ ఐదుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన పాఠశాలల్లోనూ విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే కనిపించింది. స్థానిక డిపెప్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. వేసవి సెలవుల కంటే కొద్ది రోజుల ముందు ప్లాంట్ మరమ్మతులకు గురైందని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఉపాధ్యాయులు తెలిపారు. బీవీ నగర్‌లో తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో పాటు పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిలిచింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నారులకు స్టూడెంట్ కిట్లు పూర్తిస్థాయిలో అందలేదు.

నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు లేవు. గత ప్రభుత్వ హయాంలో నాడు– నేడు కింద రూ.12 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు మినహా ఎక్కడా వసతులు కనిపించడం లేదు. 36 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. చుట్టూ ముళ్ల పొదలు ఉన్న బాత్‌రూంలకు తాళాలు వేసి ఉండటంతో పాఠశాల వెనుక వైపున మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తోంది. వంట గదులు లేక నిర్వాహకులు ఇళ్ల వద్దనే వంట చేసుకొని పాఠశాలకు తీసుకొచ్చారు. తొలి రోజు గుడ్లు లేకుండా వెజిటబుల్ రైస్‌ను వడ్డించారు. పాఠశాల సమీపంలోని చేతి పంపునీటితో చిన్నారులు దాహం తీర్చుకున్నారు. పాఠశాల పైకప్పు, గోడలు వెలుస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



చాబోలులో గుడ్లులేని భోజనం తింటున్న విద్యార్థులు





గోస్పాడు డిపెప్ పాఠశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్, తెరుచుకోని వంట గది

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుండడంతో మండలంలోని 30 మంది ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు వెళ్లారు. ఏకోపాధ్యాయ స్కూళ్ల ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు వెళ్లడంతో డెప్యుటేషన్‌పై వచ్చిన టీచర్లతో తొలి రోజు పాఠశాలలు కొనసాగాయి. రూపనగుడి, సర్వాయిపల్లె గ్రామాల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో సీఆర్పీలు లక్ష్మిదేవి, సిద్దమ్మ పాఠశాలలకు దిక్కయ్యారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 2,155 మంది విద్యార్థులు ఉండగా వీరిలో మొదటి రోజు 20 శాతం మంది మాత్రమే హాజరయ్యారు.

గదులు 3.. తరగతులు 8

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో గదుల కొరత పీడిస్తోంది. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 86 మంది విద్యార్థులు చదువుతున్నారు. 8 తరగతులకు కేవలం 3 గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక గది పూర్తి ఇరుకుగా ఉంది. ఒక్కో గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యా బోధనకు కష్టంగా ఉంది. గత ప్రభుత్వం మన బడి నాడు– నేడు అదనపు గదులు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా గదులు పూర్తయి విద్యార్థుల కష్టాలు తీరుతాయన్న ఆశ నెరవేరలేదు. వేసవి సెలవుల అనంతరం గురువారం కేవలం 35 మంది మాత్రమే పాఠశాలకు వచ్చారు.



రూపనగుడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆడుకుంటున్న విద్యార్థులు

ఆలయాలకు భద్రత ఏదీ?



చోరీ వివరాలను తెలుసుకుంటున్న భూమా కిశోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: కూటమి పాలనలో ఆలయాలకు భద్రత ఎక్కడుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి ప్రశ్నించారు. రెండు రోజుల కిందట రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో జరిగిన చోరీ ఘటనపై ఆయన క్షేత్రంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆలయాలకు భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు. గుళ్లను కాపాడుతాం, సనాతన ధర్మాన్ని కాపాడతాం అని చెప్పే డిప్యూటీ సీఎం ఆలయాల భద్రతకు ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఇక్కడ 40 ఏళ్లుగా ఎలాంటి చోరీలు జరగలేదని, కూటమి అసమర్థ పాలన వల్లే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఆలయాల్లో చోరీలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. అహోబిలం క్షేత్రంలో ఎవరో గుంటూరు నుంచి వచ్చి రెక్కీలు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రతి ఆలయానికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.20 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని, దీన్ని బట్టి ఇక్కడ సెక్యూరిటీ ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైలంకు చెందిన ఎస్.కుమార్, బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తి గీతాలకు శరణ్య, కవిత, రజిత, శ్రావణి నృత్యం చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న షర్మిల

నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందన్నారు. ఏడాది కాలంలోనే ఇలాంటి పరిస్థితి రావడం దారుణమన్నారు. స్థానిక సూరజ్ గ్రాండ్‌లో కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ డీసీసీ అధ్యక్షుడు లక్ష్మినరసింహయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ సలాం, ఉపాధ్యక్షులు అబ్రహాం, అహమ్మద్‌హుసేన్, నాయకులు చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’లో కోత విధించడం తగదు



మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

నంద్యాల(న్యూటౌన్): చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2వేలు కోత పెట్టడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజా, ఎంఆర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10వేలు, పట్టణంలో రూ.12వేలు లోపు ఉండాలని, రైస్ కార్డు ఉండాలని తదితర షరతులు పెట్టడం సరికాదన్నారు. నాయకులు దినేష్, సాయి, సందీప్, రాజేష్ పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు



ఎం.తాండలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎం.తాండ గ్రామంలో ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం దోమల నివారణకు సైపర్‌మైత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. గ్రామంలోని అన్ని ఇళ్లలో సిబ్బందితో మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా నివారణలో భాగంగా దోమల మందు పిచికారీ చేసినట్లు చెప్పారు. దీని ప్రభావం వల్ల గోడలపై వాలిన దోమలు చనిపోతాయన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రి నిద్రించే సమయంలో దోమ తెరలను వాడాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, సీహెచ్‌ఓ బ్రహ్మతేజ, హెల్త్ అసిస్టెంట్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆలయ ప్రాంగణంలో త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

గోస్పాడు: మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలోని కేంద్రంలో గురువారం అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిందని, ప్రైవేటు పాఠశాలల్లో నేర్పుతున్న చదువులు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో గుడ్డు, పాలు, మంచి భోజనం, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ రామాలయంలో అంగన్‌వాడీ చిన్నారులచే గురువారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అర్చకులు మోహనక్రిష్ణ పలకలపై అక్షరాలు దిద్దించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఫకూర్‌బీ, రాజేశ్వరమ్మ, కాశింబి, గురులక్ష్మి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక 10వ అంగన్‌వాడీ కేంద్రంలో వేద పండితులు ఆనంద శర్మ వేద మంత్రోచ్ఛరణలతో సరస్వతి పూజ నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చదువులో చిన్నారులకు మంచి పునాది అవసరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. గురువారం 3–6 ఏళ్లలోపు చిన్నారులకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానం



వాసవీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని చాబోలు రస్తాలో ఉన్న వాసవీ వృద్ధాశ్రమంలో గురువారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఉమ్మడి జిల్లాల గవర్నర్ బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నాగరాజు, జనార్దన్, శివశంకర్, సుబ్బారావు, కూరాకు శ్రీనివాసు, దత్తాత్రేయ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్యయాదవ్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. స్థానిక నిశాంత్ భవన్‌లో గురువారం వికలాంగులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వికలాంగులను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 19న పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను హైదరాబాద్‌లో సన్మానించనున్నారని, కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి, మహిళా అధ్యక్షురాలు గాయత్రి, కత్తి ఓబులేసు, బెనర్జి మాదిగ పాల్గొన్నారు.

హడావుడిగా మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

నంద్యాల (అర్బన్): నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారమంటే ఎంతో గొప్పగా ఉంటుందని కూటమి నాయకులు, కార్యకర్తలు ఊహించారు. ప్రముఖ నాయకులు హాజరవుతారని భావించిన నాయకులకు నిరాశ ఎదురైంది. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో చైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం 11 గంటలలోపే ముగిసింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయ, మైనార్టీ శాఖా మంత్రి ఫరూక్ అమరావతిలో పనులున్నాయి, త్వరగా వెళ్లాల్సి ఉందని ఆదేశాలు జారీచేయడంతో అధికారులు హడావుడిగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని ముగించేశారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఆర్‌ఐసీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానాలు పాటించాలి

దొర్నిపాడు: రైతులు పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త శ్రీనివాసులు సూచించారు. కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం క్రిష్ణాపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. భూసార పరీక్షల ద్వారా ఎరువుల మోతాదు, యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, ఆదినారాయణ మాట్లాడుతూ మినుము, మొక్కజొన్న, కంది, వరి మిరప పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. చిరుధాన్యాల సాగు, వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఉద్యానవన పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఏడీఏ శివరామిరెడ్డి, ఏఓ ప్రమీల, సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

- యోగాంధ్ర రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 13వ తేదీన బెలుం గుహల్లో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబధిత అధికారులను ఆదేశించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ రామునాయక్, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 5 వేల స్థలాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రదేశాలు నమోదు చేశామన్నారు. సంబంధిత ప్రదేశాల్లో ఈ నెల 14వ తేదీన ఉదయం 7 నుంచి 8గంటల వరకు డెమో నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. జిల్లాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేలా డీఎంహెచ్‌ఓ, మున్సిపల్ కమిషనర్, డీఎస్‌డీఓ చర్యలు తీసుకోవాలని చెప్పారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 8 లక్షల రిజిస్ట్రేషన్ లక్ష్యానికి గాను ఇప్పటివరకు 7.54 లక్షల రిజిస్ట్రేషన్ పూర్తయిందని పెండింగ్‌లో ఉన్న 46వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను గురువారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 14, 21వ తేదీల్లో జరిగే కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు.

జడ్జి ఆకస్మిక తనిఖీ



మెడికల్ కాలేజీలో వైద్యులతో మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): పట్టణ పట్టణంలో శాంతిరాం మెడికల్ కళాశాలలోని ఆసుపత్రిలోని మానసిక వికలాంగుల విభాగాన్ని, నంద్యాల జిల్లా ప్రత్యేక ఉపకారాగారాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి లీలా వెంకట శేషాద్రి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైల్‌ను తనిఖీ చేసి ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లు పైబడిన వృద్ధ ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్, డాక్టర్ గురుకుమార్, న్యాయవాది శేషసాయి పాల్గొన్నారు. అనంతరం మానసిక వికలాంగుల విభాగాన్ని సందర్శించి, మానసిక రోగుల యోగ క్షేమం, వారి సంఖ్య, హక్కుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ మూర్తి, డాక్టర్ సింధూ, కోర్ట్ సిబ్బంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సాయం అందిస్తాం

ఆళ్లగడ్డ: కారాగారంలోని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. ఆయన గురువారం ఆళ్లగడ్డలోని ఉపకారాగార కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏదైనా న్యాయపరమైన సమస్యలుంటే న్యాయ సహాయ కేంద్రం ద్వారా పొందవచ్చన్నారు. ఖైదీల సమస్యలు, కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ 15100 ద్వారా సేవలను అభ్యర్థించవచ్చన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఇన్‌చార్జ్ ఉపకారాగార అధికారి సుబ్బయ్య, న్యాయవాది షాహిన బేగం తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



ఎస్సీ వసతి గృహం ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఆర్ డీఈ వెంకటరెడ్డి

ఉయ్యాలవాడ: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ డీఈ వెంకటరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన గురువారం ఉయ్యాలవాడలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రమైన దొర్నిపాడు, శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి ఎస్సీ బాలుర వసతి గృహాల అభివృద్ధికి రూ.29 లక్షలు చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం, గదుల్లో బండపరుపు, ప్రహరీ నిర్మాణాలకు ఈ నిధులు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. పనులు 90 శాతం పూర్తయ్యాయని, మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తవుతాయని డీఈ తెలిపారు. ఏఈ వెంకటయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



రుద్రవరంలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

రుద్రవరం: శాస్త్రీయ సలహాలు పాటించి పంటల సాగులో పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కేవీకే శాస్త్రవేత్త ధనలక్ష్మి రైతులకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు పెద్దకంబలూరు, శ్రీరంగాపురం గ్రామాల్లో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ధనలక్ష్మి, కృష్ణమూర్తితో పాటు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు వ్యవసాయంలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన ఎరువుల మోతాదును వివరించారు. మొక్కజొన్న, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, ఫహిమా తబస్సుమ్ తదితరులు ఉన్నారు.